


నేను ఆమెని ముట్టుకున్నాను... అంటే ఆమెని తాకాను.

నా వయసు ఇరవై యేళ్లు అయినా ముప్ఫయి యేళ్ల వివాహిత ఐన అందమైన ఆడదాన్ని - ఆమె భర్త పక్కన వుండగానే నా చేత్తో ఆమె అందమైన భుజాన్ని చటుక్కున తాకాను.

అఫ్‌కోర్సు! తర్వాత దానికి మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చిందనుకోండి.

మరి ఎందుకు తాకానని అడగరేం? అడిగారా... ఒ.కె. అయితే తప్పకుండా చెప్తాను.

ఆ రోజు——

సూర్యుని ప్రచండమైన ఎండ వేడికి - వాతావరణంలోని గాలి తేలికపడ్డదై అంతులేని వేగంతో వీచే గాల్పులుగా మారి - దానికి బస్సువేగం తోడై కిటికీల లోంచి గూబల్ని అదర గొడ్తుండగా-

రిలీఫ్ కోసం సిగరెట్ కాల్చబోతూ - ఎందుకో నా ముందు సీట్లో కూర్చున్న ఓ కుర్రవాడిపై నా చూపు ప్రసరించాను. అతడి చూపులు నాకవతలి ప్రక్కగా కూర్చున్న ఆమె అద్భుతమైన వక్ష స్థలాన్ని తడుము తున్నాయ్.

దానిక్కారణం——

బస్‌లో ప్రయాణం చేస్తూ — మగతగా నిద్రపోతున్న ఆమె పైట కొంగు పూర్తిగా కిందికి జారిపోయింది. జాకెట్లోని ఆమె అందాలు బస్సు కుదుపులకి మంద పవనాలకి చిలిపిగా కదలాడే జవరాలి ముంగుర్లలా - తామ రాకుపై పడ్డ నీటి బొట్టు కిందనున్న అలల కదలికకి వూగినట్లుగా - నాట్యం చేస్తున్నాయి.

ఆ మనోహరమైన దృశ్యం నుంచి - అతి కష్టం మీద నా దృష్టి తప్పించాను.

ఆ కుర్రాడు మాత్రం ఈ లోకంలో లేడు.

మరామె భర్త ఏం చేస్తున్నాడని మీలో ఎవరికైనా అనుమానం రావడం - ఆమె వివాహిత అన్నంత సహజం! బస్ కిటికీలో మోచేతి నుంచి -దానిపై తల ఆన్చి నిద్రపోతున్నాడు.

అయితే నా వెనుకగా ఓ ముగ్గురు ఆకతాయి కుర్ర వాళ్లు వున్నారు. అదృష్టవశాత్తూ - ఈ కమనీయ దృశ్యకావ్యం వాళ్లు చూడలేదు. వాళ్లు అక్కడ్నించి లేచి నిలబడే వరకూ వారి కటువంటి అవకాశం లభించలేదు.

నేను తనని గమనించడం గ్రహించి - నాముందు కుర్రవాడు తదేకంగా చూడ్డం మాని తరచు చూడసాగాడు.

ఆమె నలుగురిలో అల్లరి కాకుండా నవమి పందిట్లో వేసే 16 ఎం. ఎం. సినిమాలా కాకూడదంటే - లేపాలి - నిద్ర నుంచి ఆమెని మేల్కొలపాలి!

కానీ - ఎలా?

మరోసారి ఆమెకేసి చూశాను.

మూసుకొని వున్న ఆమె సున్నితమైన కనురెప్పలు కాటుకతో నిండి - తుమ్మెదలే వున్నాయన్న భావన కల్గిస్తున్నాయ్.

ఆమె నోరు - ముడుచుకున్న అందమైన పెదవులతో - మరీ మరీ చూడాలన్పించేలా వుంది.

కానీ ఆమెని లేపడం ఎలా? ఏం చేయాలి!

రెండు మూడు క్షణాలు ఆలోచించి ఓ స్థిర నిశ్చయానికొచ్చాను.

మరుక్షణం——

నా చేయి మిసమిసలాడుతున్న ఆ భుజాన్ని మెరుపులా తాకి - దూరంగా జరిగింది.

మరో క్షణం గడిచేసరికల్లా——

ఆమె కళ్లు తెరవడం - ఆ చేయి నాదేనని తెల్సుకోవడం - వెంటనే ఆమె చెయ్యి నా దవడ్ని ఢీ కొనడం జరిగిపోయాయ్. అయితే ఆమె మాత్రం తన కొంగు సంగతి పట్టించుకోలేదు.

నా కాశ్చర్యం వేసింది. అంతలోనే - అది చూసి మిగిలిన మగాళ్లంతా తమ ప్రతాపాన్ని చూపించి - ఆమెని ఆకర్షించాలని చేసిన ప్రయత్నంలో - నా రెండు చెంపలూ బాగా పండిన దానిమ్మ పళ్లలా విడిపోయాయ్. నా ముక్కు నోటిని స్థానభ్రంశం చేసింది. నా రెక్క గూళ్లు పక్కకి జరిగాయ్. నా మొహం ఆకుల చాటున వున్న గుమ్మడి కాయలా చేతుల చాటుకు పోయింది.

నగుబాటు నుంచి ఆమెని తప్పించడంకోసం నే చేసిన పనికి చెల్లించిన మూల్యం ఇదే!




వాళ్ళిద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. కానీ వాళ్ళ హోదాల్లో మాత్రం చాలా తేడావుంది.

ఒకరు ఆఫీసరు అయితే మరొకరు ప్యూను. వారి పేర్లు చంద్రశేఖర్, గంటయ్య.

వాళ్ళిద్దరూ ఒకే ప్రాంతంవాళ్ళు కావడంతో ప్రతి రోజూకాస్త అటుఇటుగా కలుసుకునేవాళ్ళు బస్ స్టాప్‌లో.

మొదటిరోజు ఆఫీసర్ని చూసిన గంటయ్య "నమస్కారం సార్" అంటూ ... కాస్త ముందుకు వెళ్ళి నిలబడ్డాడు, (ఆయనకు కాస్తదూరంగా) మరీ ఆఫీసరు గారితో సమానంగా నుంచుంటే బావుండదేమోనని.

ఇంతలో బస్సు రానేవచ్చింది. వచ్చివచ్చి గంటయ్య ముందు ఆగింది. ఆఫీసర్ అయిన చంద్ర శేఖర్ విసుక్కుంటూ... వగరుస్తూ... ఎలాగో బస్సెక్కాడు పరుగెడుతూ.

గంటయ్య సీటు చూపించాడు.

మరునాడు...

మామూలుగా ఇద్దరూ అక్కడే నిలబడ్డారు. కానీ... ఆఫీసరుగారు మాత్రం... 'ఛీ ఛీ ఈ హైదరాబాదులో బస్సులు ఏ జన్మకీ స్టాప్‌లో ఆగవు' అని అనుకొని... నిన్న గంటయ్య నుంచున్న చోట్లో తాను నుంచున్నాడు (నిన్న ముందుకి వెళ్ళి బస్సు ఆగిందని).

గంటయ్య మాత్రం... స్టాప్‌లోనే నుంచున్నాడు.

బస్సు యథావిధిగా వచ్చి స్టాప్‌లోనే ఆగింది. పాపం... ఆఫీసర్‌గారికి పరుగు తప్పలేదు. గంటయ్య మాత్రం ఠీవిగా బస్సెక్కాడు.

ఆ మరునాడు...

ఇంక ఇలాకాదని నిన్న తాను నుంచున్న చోటుకి, స్టాప్‌కి మధ్యగా నుంచుంటే నయం అనుకుని— ఆఫీసరుగారు అలానే మధ్యగా నుంచున్నాడు.

కొంచెం ఆలస్యంగా వచ్చిన గంటయ్య ఇది గమనించి ఆఫీసర్‌గార్కి దూరాన్నుంచే ఓ సలాం కొట్టి ఆఫీసరుగార్ని దాటి కాస్త దూరంగా నుంచున్నాడు.

బస్సు దానిటైం ప్రకారం రానూవచ్చింది, గంటయ్య ముందే ఆగనూ ఆగింది, ఎవరో మంత్రించి నట్టు.

గంటయ్య కాలర్ ఎగరేస్తూ ఎక్కడం గమనించకపోలేదు ఆ ఆఫీసరుగారు.

ఇంక నాల్గోరోజు ఏమైతే అయిందని... తన ఆఫీసర్ దర్జా పక్కనపెట్టి గంటయ్యతో పిచ్చాపాటి కబుర్లు చెప్తున్నట్టు నటిస్తూ... తను... గంటయ్య ప్రక్కనే నుంచున్నాడు.

బస్సు ఈసారి వాళ్ళిద్దరి ముందు ఆగింది.

ఈ తంతును గమనిస్తున్న ఆఫీసర్‌గార్కి ఈ తిరకాసు ఏమిటో అర్థంకాక అది ఏమిటో తెలుసుకోవాలని "ఏమిటయ్యా బాబూ! బస్సు నువ్వు ఎక్కడ నుంచుంటే అక్కడే ఆగుతుంది. ఏమిటి... ఈ చిత్రం?" అని అడిగేశాడు.

దానికి ప్యూన్ అయిన గంటయ్య సిగ్గుపడుతూ "మరండీ... ఈ బస్ డ్రైవరు నాకు... పిల్లనిచ్చిన దాని తండ్రండి. అంటే మా మాంగారండీ..." అంటూ చెప్పాడు అసలురహస్యం.

'ఆహా! అల్లుడి హోదా అంటే ఇదేకాబోలు!' అని మనసులోనే అనుకున్నాడు ఆ పెళ్ళికాని ఆఫీసర్.